ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 5 ఏప్రిల్ 2024



అంతర్జాతీయ టీ-20 మ్యాచ్‌కు హరీష్



హిరమండలం, ఏప్రిల్ 4: హిరమండలం మండలం గొట్ట గ్రామానికి చెందిన బత్తుల హరీష్ అంతర్జాతీయ టీ-20 మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 1 నుంచి నేపాల్‌లో జరుగుతున్న ఇండియా-నేపాల్ అంతర్జాతీయ టీ-20 సిరీస్‌కు ప్రస్తుతం ఆడుతున్నాడు. శ్రీలంకలో వచ్చే నెల 10న జరగనున్న అండర్ -21 విభాగంలో ఇండియా-శ్రీలంకలో టీ-20 సిరీస్‌కు రాష్ట్రం నుంచి హరీష్ ఒక్కడే ఎంపికయ్యాడు. హరీష్ డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లి దండ్రులు వ్యవసాయం, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు.

ఇంత నిర్దయా?

- పింఛన్‌దారుల పట్ల కక్షగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం
- ఆ నెపం విపక్షాలపై నెట్టివేసేందుకు పన్నాగం
- చాలాచోట్ల ఆలస్యంగా సిబ్బంది హాజరు
- పడిగాపులు కాసిన లబ్ధిదారులు



శ్రీకాకుళం : దమ్మలవీధి సచివాలయంలో పింఛన్‌దారుల రద్దీ



టెక్కలి ఐదవ సచివాలయం వద్ద పింఛన్ పంపిణీలో తోపులాట



సరుబుజ్జిలి సచివాలయంలో ఉదయం 11 గంటల వరకూ ఉద్యోగులు రాక నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

పింఛన్ లబ్ధిదారుల పట్ల ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తోంది. వృద్ధులు, వికలాంగులు అని కూడా చూడకుండా డబ్బుల పంపిణీలో ఇబ్బంది పెడుతోంది. రెండోరోజు గురువారం కూడా చాలాచోట్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొన్నిచోట్ల నగదు సకాలంలో సచివాలయాలకు చేరుకోలేదు. మరికొన్నిచోట్ల సిబ్బంది విధులకు ఆలస్యంగా వచ్చారు. దీంతో లబ్ధిదారు మండుటెండలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో.. దాన్ని విపక్షంపై నెట్టేసేందుకు ప్రభుత్వమే ఇలా చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● **ఆమదాలవలస:** ఆమదాలవలసలోని సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేశారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ నెల మూడు నుంచి ఆరోతేదీ వరకూ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు, నడవలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు.. ఇంటివద్దకు వెళ్లి పింఛన్లు అందజేయాలని స్పష్టం చేసింది. కాగా.. గురువారం ఆమదాలవలస మునిసిపాలిటీలోని పలు సచివాలయాల్లో కొందరు ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల సచివాలయ ఉద్యోగులు ఉదయం 11 గంటల వరకు హాజరుకాలేదు. దీంతో వృద్ధులు, వితంతవులు, దివ్యాంగులు గంటల తరబడి నిరీక్షించారు. అలాగే ఆమదాలవలస మునిసిపాలిటీ మోనింగివారివీధిలోని సచివాలయం- 1, 2 కేంద్రాల్లో కొంతమంది పింఛన్‌దారులు కుటుంబ సభ్యుల సాయంతో ఆటోలు, ద్విచక్రవాహనాలపై వచ్చి పింఛన్ తీసుకున్నారు. సచివాలయ ఉద్యోగులెవరూ పింఛన్‌దారుల ఇంటికి వెళ్లే దాఖలాలు కనిపించలేదు.

● **సంతబొమ్మాళి:** సంతబొమ్మాళి మండలంలోనూ నిబంధనలు పాటించలేదు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచే సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించి.. చాలాచోట్ల నిర్ణీత సమయానికి కార్యాలయాలు తెరవలేదు. లక్కివలస సచివాలయంలో మధ్యాహ్నం 12 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో మండుటెండలో పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు.

● **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలోని సచివాలయ ఉద్యోగులు బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసి రావడానికి ఆలస్యమవడంతో పింఛన్‌దారులు పడిగాపులు కాశారు. బెల్లుపడ సచివాలయానికి ఉదయం 7 గంటలకే పింఛన్‌దారులు చేరుకున్నారు. సచివాలయ ఉద్యోగులు మధ్యాహ్నం 2వరకు డబ్బులు డ్రా చేసి రాకపోవడంతో నిరీక్షించారు.

టెక్కలిలో తోపులాట

టెక్కలి: టెక్కలి మేజర్‌పంచాయతీ ఐదవ సచివాలయం పరిధి గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో గురువారం పింఛన్ల పంపిణీ ప్రక్రియలో తోపులాట చోటుచేసుకుంది. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇలా అనేకరకాల విభాగాల పింఛన్‌దారులు అక్కడకు చేరుకున్నారు. సచివాలయ సిబ్బంది కనీసం క్యూలైన్ కూడా ఏర్పాటు చేయలేదు. పింఛన్‌కు వచ్చేవారికి, వెళ్లేవారికి ఒకటే మార్గం కావడంతో పెద్దఎత్తున తోపులాట చోటుచేసుకోవడంతో పింఛన్‌దారులు అవస్థలు పడ్డారు.

అభయహస్తం ఏదీ?

టెక్కలి, ఏప్రిల్ 4: అభయహస్తం పింఛన్‌దారులకు సాంకేతిక సమస్య కారణంగా ఈ నెల పింఛన్ డబ్బులు పంపిణీ చేయలేదు. స్వయంశక్తి సంఘాల్లో సభ్యత్వం ఉండి పొదుపు చేసిన మహిళకు 60ఏళ్లు దాటితే.. నెలకు సామాజిక భద్రతా పింఛన్ రూ.3వేలుతో పాటు అభయహస్తం పింఛన్ రూ.500 అందించేవారు. ఈసారి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లో గురువారం సాయంత్రం వరకు అభయహస్తం పింఛన్ పంపిణీకి సంబంధించిన డిస్‌ప్లే కనిపించలేదు. దీంతో అభయహస్తం పింఛన్లు నిలిచిపోయాయి. జిల్లాలో 13,705 మంది అభయహస్తం పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికీ సామాజిక పింఛన్లు రూ.3వేలు చొప్పున అందజేశారు. కానీ, అభయహస్తం కింద 500 చొప్పున చెల్లించాల్సిన పింఛన్‌ను మాత్రం అందజేయకపోవడంతో వారంతా నిరాశ చెందారు. ఈ విషయమై ఎంపీడీవో విజయకుమారి వద్ద ప్రస్తావించగా అభయహస్తం పింఛన్లకు సంబంధించిన యాప్ డిస్‌ప్లే కాకపోవడంతో చెల్లింపులు నిలిచిపోయావని తెలిపారు. డబ్బులు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఖాతాల్లో జమయ్యాయని, యాప్ డిస్‌ప్లే అయిన వెంటనే పంపిణీ ప్రక్రియ చేపడతామన్నారు.

పింఛన్ ఎప్పుడిస్తారని అడిగినందుకు..



సింహాచలంపై దాడికి పాల్పడిన వలంటీరు తిరుపతిరావు

- లబ్ధిదారుడు కుమారుడిపై వలంటీర్ దాడి
- సబ్‌కలెక్టర్, పోలీసులకు బాధితుడు ఫిర్యాదు
- కేసు నమోదులో జాప్యం

టెక్కలి, ఏప్రిల్ 4: తన తండ్రికి పింఛన్ ఎప్పుడిస్తారని అడిగినందుకు ఓ లబ్ధిదారుడి కుమారుడిపై వలంటీర్ దాడికి పాల్పడ్డాడు. కులంపేరుతో దుర్భాషలాడాడు. ఆ వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదులో జాప్యం చేశారు. దీంతో బాధితుడు తనకు న్యాయం చేయాలంటూ సబ్‌కలెక్టర్‌ను ఆశ్రయించారు. బాధితుల వివరాల మేరకు.. టెక్కలి మేజర్‌పంచాయతీ చాకిపల్లి సచివాలయ పరిధిలో పింఛన్‌దారుడు కుప్పిలి అప్పారావు కుమారుడు సింహాచలంపై వలంటీర్ బొమ్మాళి తిరుపతిరావు దాడికి పాల్పడ్డాడు. బుధవారం సచివాలయం వద్దకు తిరుపతిరావు వెళ్లి.. తన తండ్రికి పింఛన్ సొమ్ము ఎప్పుడు ఇస్తారని వలంటీర్ తిరుపతిరావును ప్రశ్నించాడు. దీంతో 'ఇక్కడ నీకేమి పనిరా?.. అంటూ దాడి చేయడమే కాకుండా జాతి తక్కువ నా కొడకా అంటూ కులం పేరుతో వలంటీర్ తిరుపతిరావు దూషించాడు' అని సింహాచలం ఆరోపించారు. దీనిపై టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై దాడి చేసిన వలంటీర్‌పై అట్రాసిటీ కేసు నమోదుచేసి తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాడి జరిగిన సమయంలో స్థానికులు బోళ్ల గోపి, పంగ గిరి, కత్తుల కుమార్, పంగ సన్యాసి, తదితరులు ఉన్నారని తెలిపాడు. ఘటనపై తక్షణమే దర్యాప్తు చేసి వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు. పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గురువారం సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్‌కు బాధితుడు సింహాచలం ఫిర్యాదు చేశాడు. దీనిపై వెంటనే దర్యాప్తు చేయాలని సబ్‌కలెక్టర్ తహసీల్దార్ మురళీకృష్ణకు ఆదేశించారు. ఈ విషయమై టెక్కలి సీఐ పి.షైడయ్య వద్ద ప్రస్తావించగా దీనిపై విచారణ చేస్తున్నామని, ఇంకా కేసు నమోదు చేయలేదన్నారు. ఇదిలా ఉండగా సింహాచలంపై తిరుపతిరావు దాడికి పాల్పడిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి.



ఆమదాలవలస: మోనింగివారి వీధి సచివాలయానికి వాహనాల్లో వచ్చిన పింఛన్‌దారులు



ఇచ్ఛాపురం: బెల్లుపడ సచివాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు



సంతబొమ్మాళి : లక్కివలస సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

మెట్టూరులో ఎలుగుబంటి సంచారం



వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 4: వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులో బుధవారం రాత్రి ఎలుగుబంటి సంచరించింది. సోమవారం పాడుపడిన ఇంట్లో దూరిన ఎలుగుబంటిని అటవీశాఖ, జూ అధికారులు బోనులో బంధించి విశాఖలోని జూకు తరలించిన విషయం తెలిసిందే. మళ్లీ బుధవారం రాత్రి మరో ఎలుగుబంటి గ్రామంలో సంచరించి జీడితోటల్లోకి వెళ్లడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జీడితోటలో ముగ్గురి రైతులపై దాడి చేయగా ఇద్దరు మృతి చెందారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఎలుగుబంటి ఏక్షణాన తమపై దాడి చేస్తుందోమోనని కలవరపడుతున్నారు. గురువారం అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. జీడితోటలకు ఒంటరిగి రైతులు వెళ్లొద్దని సూచించారు. అటవీశాఖాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ఎలుగుబంట్ల సంచారాన్ని నియంత్రించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భానుడు భగభగలే



- జిల్లాలో నేడు, రేపు తీవ్ర ఎండలు, వడగాల్పులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే
- హెచ్చరించిన రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

పేదల ఊటీగా పేరు గాంచిన శ్రీకాకుళం జిల్లాలో శుక్ర, శనివారాల్లో భానుడు తీవ్ర ప్రతాపం చూపనున్నాడు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ(ఏపీఎస్‌డీఎంఏ) గురువారం సాయంత్రం హెచ్చరిక జారీచేసింది. జిల్లాలో 30 మండలాల్లో శుక్రవారం ఏకంగా 24 మండలాల్లో తీవ్ర వేడిమి ఉంటుందని.. వడగాల్పులు వీచే అవకాశం అధికంగా ఉందని వెల్లడించింది. 4 మండలాల్లో మోస్తరుగా ఎండలు ఉంటాయని.. మరో రెండు మండలాల్లో మాత్రం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుందని పేర్కొంది. శనివారం 25 మండలాల్లో భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, తీవ్ర వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరించింది. 5 మండలాల్లో మోస్తరు ఎండ ఉంటుందని స్పష్టం చేసింది. ఆమదాలవలస, బూర్జ, ఎచ్చెర్ల, జి.సిగడాం, హిరమండలం, ఇచ్ఛాపురం, జలుమూరు, కంచిలి, కవిటి, కోటబొమ్మాళి, కొత్తూరు మండలాల్లో ఈ రెండు రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ఎల్.ఎన్.పేట, లావేరు, మందస, మెళియాపుట్టి, నందిగాం, నరసన్నపేట, పలాస, పాతపట్నం, పోలాకి, పొందూరు, సారవకోట, సరుబుజ్జిలి, సోంపేట, శ్రీకాకుళం, టెక్కలి మండలాల్లో కూడా ఎండలు ప్రభావం చూపనున్నాయి. ఆయా మండలాల్లో 43 డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి 45డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది.ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

వడదెబ్బకు దివ్యాంగుడు మృతి

మెళియాపుట్టి, ఏప్రిల్ 4: రట్టిణి గ్రామానికి చెందిన వినోద్ పాత్రో(60)అనే దివ్యాంగుడు గురువారం వడదెబ్బ తగిలి మృతిచెందాడు. గురువారం ఉదయం వసుంధర గ్రామంలోని సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకున్నాడు. అనంతరం ఒడిశాలోని సీతాపురం సమీపంలో పొలంలో వడదెబ్బకు గురై మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాంగ్రెస్ గూటికి కృపారాణి

- నేడు బద్వేల్‌లో షర్మిల సమక్షంలో చేరిక



టెక్కలి, ఏప్రిల్ 4: కేంద్ర మాజీమంత్రి, వైసీపీ పూర్వపు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కిల్లి కృపారాణి కాంగ్రెస్ గూటికి చేరుకోనున్నారు. పార్టీలో తగిన ప్రాధాన్యం దక్కలేదంటూ బుధవారం ఆమె వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం కడప జిల్లా బద్వేల్ ప్రాంతంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరనున్నారు. బద్వేల్‌లో షర్మిల బస్సుయాత్ర ప్రారంభించనున్నారు. ఈ మేరకు గురువారం కృపారాణి బద్వేల్ బయలుదేరారు. టెక్కలి అసెంబ్లీ బరి నుంచి ఈసారి కాంగ్రెస్ పార్టీ తరుపున ఆమె పోటీచేసే అవకాశాలున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగి సస్పెన్షన్

టెక్కలి, ఏప్రిల్ 4: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు టెక్కలి ఆర్టీసీ డిపో కండక్టర్ బసవల ధనుంజయరావును సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో కండక్టర్ ధనుంజయరావు పాల్గొన్నారు. మోడల్ కోడ్‌ఆఫ్ కాండక్ట్‌లో భాగంగా ఆయనను సస్పెన్షన్ చేశామని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు.

రాజీనామా చేస్తారా? లేదా?

- వలంటీర్లపై వైసీపీ నేతల తీవ్ర ఒత్తిడి
- ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలంటూ ఆదేశాలు
- భవిష్యత్ పరిస్థితులపై వలంటీర్ల ఆందోళన

(శ్రీకాకుళం అర్బన్)

సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైసీపీ.. వలంటీర్లను ప్రధానాస్త్రాలుగా వాడుకుంటోంది. ఎన్నికల కమిషన్ వద్దని హెచ్చరిస్తున్నా.. ప్రచారంలో పాల్గొనాలంటూ వైసీపీ నేతలు వారిపై ఒత్తిడి చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలే అడ్డంకి అయితే మూకుమ్మడిగా రాజీనామాలు చేయాలని ఆదేశిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే మీ భవిష్యత్‌కు మాది గ్యారంటీ అంటూ భరోసా ఇస్తున్నారు. ఈ క్రమంలో మూకుమ్మడిగా వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. కాగా.. ఒకవేళ వైసీపీ గెలవకపోతే భవిష్యత్‌లో తమ పరిస్థితి ఏంటని వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు.

● వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను నియమించింది. ఒక్కొక్కరికీ 50 ఇళ్లను కేటాయిస్తూ.. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించే బాధ్యత అప్పగించింది. ఇప్పుడు ఆయా ఓట్లన్నీ వైసీపీకి పడేలా ప్రజల్లో సంక్షేమ పథకాల లబ్ధిపై అవగాహన కల్పించాలని అధిష్ఠానం ఇప్పటికే సూచించింది. అవసరమైతే రాజీనామా చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలంటూ వైసీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో సుమారు 1,600 మంది వలంటీర్లు ఉన్నారు. వారందరి చేత రాజీనామాలు చేయించేందుకు పూనుకున్నారు. ఈ మేరకు వలంటీర్ల విధి నిర్వహణ బాధ్యతలు చూసే ఎస్‌టీఏ(ఎమ్ఎల్‌టీ) లోకేష్ వలంటీర్లకు రాజీనామా చెయ్యాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కోడ్ నిబంధనల మేరకు మార్చి నెలాఖరున వలంటీర్లందరూ సెల్‌ఫోన్లు, సిమ్‌లు, తంబ్ మిషన్‌లను సచివాలయాలకు అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వలంటీర్ల పర్సనల్ నెంబర్లలో వారిని సంప్రదిస్తున్నారు. ఉగాదిలోగా మూకుమ్మడిగా రాజీనామా చేయాలని సూచిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు గెలుపుకోసం కార్యకర్తల్లా పనిచేయాలని ప్రతి డివిజన్‌లోని పార్టీ ఇన్‌చార్జిలు, నేతలు వలంటీర్లకు ఆదేశించారు. రూరల్ మండలంలో 400 మంది, నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 670 మంది వలంటీర్లు ఉన్నారు. శుక్రవారం ఉదయం రాజీనామా పత్రాలను సమర్పించాలని వారందరికీ తెలిపారు. బుధవారం మండలవీధిలో వైసీపీ నాయకుడి ఇంటి వద్దే వలంటీర్లతో రాజీనామా పత్రాలు రాయించారు. అయితే గురువారం రాత్రి వరకు నగరపాలక సంస్థ కార్యాలయానికి ఒక్క రాజీనామా పత్రం కూడా అందలేదని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం 50 డివిజన్లలోని వలంటీర్లంతా కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి రాజీనామాలు అందజేసేలా వైసీపీ నాయకులు చర్యలు చేపడుతున్నారు.

> సరుబుజ్జిలి మండల వాలంటీర్లు అందరికీ ముఖ్య గమనిక రేపు అనగా 5వ తారీఖు. మన మండలంలో ఉన్నటువంటి వాలంటీర్లు అందరూ కూడా మన మండల నాయకుల ఆధ్వర్యంలో అలాగే మన పంచాయతీ సర్పంచ్ల ఎంపీపీలు ఎంపీటీసీలు ఆధ్వర్యంలో రేపు ఉదయం 10:30 గంటలకు మన మండల ఎంపీడీవో ఆఫీసు నందు మనం అందరం కూడా వాలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేయడం జరుగుతుంది. కావున ప్రతి ఒక్క వాలంటీర్ కూడా ఈ రాజీనామా చేసే కార్యక్రమంలో ఎవ్వరు కూడా తూచితప్పకుండా సమయానికి మన ఎంపీడీవో ఆఫీస్ కి వచ్చి ప్రతి ఒక్కరు రాజీనామా పత్రాలు అందజేస్తారని కోరుకుంటున్నాం జై జగన్ జై వైయస్సార్ 19:
>
> **రాజీనామాకు వైసీపీ నేతల పిలుపు ఇలా..**

ఆందోళనలో వలంటీర్లు

రాజీనామా చేస్తే తమ పరిస్థితి ఏంటంటూ వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లపాటు సేవలందించిన వారిపై రాజీనామాల ఒత్తిడి చేయడంతో ఏమి చేయాలో తెలియక సతమతమవుతున్నారు. రాజీనామా చేస్తే.. ఎన్నికల తర్వాత మళ్లీ తమను విధుల్లోకి తీసుకుంటారో లేదోనని తర్జనభర్జన పడుతున్నారు. ఇదెక్కడి వేధింపులు అంటూ తలలు పట్టుకుంటున్నారు.

రాజకీయాలకు తలొగ్గి..

పాతపట్నం: పాతపట్నం మండలంలో 64మంది వలంటీర్‌లు మూకుమ్మడిగా గురువారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.రామకృష్ణరాజుకు రాజీనామా పత్రాలను అందజేశారు. కొంతమందికి ఇష్టం లేకున్నా వైసీపీ నేతల ఒత్తిడితో రాజీనామా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేస్తే భారీ తాయిలాలు ఉంటాయంటూ కొంతమంది నేతలు ప్రలోభ పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో 36 మంది వలంటీర్లు, జలుమూరు పంచాయతీలో 15 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు.

రాజీనామా నెపంతో వలంటీర్ల ఎన్నికల ప్రచారం



స్పీకర్ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గంలోని వలంటీర్లు అంతా ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చి రాజీనామాలు చేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎలాగూ రాజీనామా చేస్తామనే ఉద్దేశంతో.. కొంతమంది వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. గురువారం స్పీకర్ తమ్మినేని సీతారాం ఆమదాలవలస మండలం నారిపేట, ఇసుకలపేట, దిబ్బలపేట గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో కొంతమంది వలంటీర్లు పాల్గొన్నారు.



డొంకూరులో 200కేజీల చేప లభ్యం

ఇచ్ఛాపురం మండలం డొంకూరు తీరంలో అరుదైన కత్తిముక్కు చేప లభ్యమైంది. డొంకూరుకి చెందిన మత్స్యకారుడు కోడ నారాయణ గురువారం వేకువజామున సముద్రంలో వేటకు వెళ్లగా ఈ చేప చిక్కింది. సుమారు 10అడుగుల పొడవు, 200 కేజీల బరువు ఉంటుందని తెలిపారు. ఇక్కడ దీని విలువ రూ.9వేలు ఉంటుందని, ఇతర ప్రాంతాలకు తరలిస్తే రూ.50వేల వరకు పలుకుతుందని చెప్పారు. - ఇచ్ఛాపురం

తాగునీరు సరఫరా చేయండి

● అంపలాం కాలనీవాసులు వైసీపీ నాయకులకు నిలదీత

● ఓట్ల కోసం మా కాలనీలో ప్రచారానికి రాకండి

పోలాకి: తాగునీటి సమస్యపై గురువారం అంపలాం పంచాయతీ పరిధిలో కాలనీ వాసులు వైసీపీ నాయకులను నిలదీశారు. సమస్యలు పరిష్కరించకుండా ఓట్ల కోసం మా కాలనీకి రావద్దని తెలిపారు. గురువారం ఇక్కడ వైసీసీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు 'గత ఎన్నికల ముందు అంపలాం పంచాయతీ ప్రజలకు తాగు నీరు సమృద్ధిగా సరఫరా చేస్తాం. మా వైసీపీ అభ్యర్థికి ఓటేసి గెలిపించండి. అని నాయకులు యాపర ధర్మారావు, ఎంపీటీసీ మూర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న ధర్మాన కృష్ణదాస్, సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న కరిమి రాజేశ్వరరావు ఓట్లువేసి గెలిపించాలని పదేపదే కోరారు. దీంతో మేమంతా ఓటువేసి అధిక మెజార్టీతో గెలిపించాం. ఆ తర్వాత మా నీటి కష్టాలు ప్రజాప్రతినిధులకు చెపితే పట్టించుకోవడం లేదు. గత ఐదేళ్లుగా తాగునీటికిఇబ్బంది పడుతున్నాం' అని ఎన్నికల ప్రచారానికి వచ్చిన వైసీపీ నాయకులను మహిళలు, యువకులు నిలదీశారు. తాగునీరు లేక బయట క్యాన్ రూ.20కు కొనుగోలు చేస్తున్నామని, ఓట్లువేసి నాయకుల వైఫల్యంతో పాట్లుపడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తంచేశారు.వైసీపీ తరపున ఎన్నికల ప్రచారానికి వచ్చిన డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జడ్పీటీసీ కృష్ణచైతన్యకు సర్పంచ్ ప్రతినిధి ధర్మారావు, ఎంపీటీసీ మూర్తి, సచివాలయ సిబ్బందికి ఎన్నోసార్లు తమ సమస్యను విన్నవించామని తెలిపారు. ఇంత వరకూ తాగునీరు సరఫరా చేయలేదని, టాంక్ ద్వారా నీరు మూడు రోజలకోసారి వస్తోందని మహి ళలు వాపోయారు. సర్పంచ్ ప్రతినిధి ధర్మారావుకు వీధిలో బల్బులేదు వేయండని అడిగితే.. 'నేను విద్యుత్ స్తంభం ఎక్కాలా, తాగునీరు అడిగితే నేను భూమిలో గొట్టాలు పాతి పెట్టాలా, పింఛన్‌గురించి అడిగితే సచివాలయానికి వెళ్లండని' సమాధానాలు ఇచ్చారని నాయకులకు తెలియజేశారు.

అరగంటపాటు వాగ్వాదం

ఉపాధి హామీ పనులకు వెళ్లిన మహిళలు తిరిగి ఇంటికి వచ్చే సమయంలో ప్రచారానికి కాలనీకి వచ్చిన డీసీసీబీ చైర్మన్ రాజేశ్వరరావుకు చుట్టుముట్టారు. 30 నిమిషాల పాటు కాలనీ వాసులు, డీసీసీబీ చైర్మన్‌కు వాదోపవాదనలు జరిగాయి. తర్వాత మా సమస్యలు పరిష్కరించకుండా ఓటుకోసం మా కాలనీకి వైసీపీ నాయకులు, అభ్యర్థి రావద్దని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మహిళలు, యువకులను ఒప్పించి ఎన్నికల తర్వాత ఇక్కడ సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.



డీసీసీబీ చైర్మన్ రాజేశ్వరరావుకు నిలదీస్తున్న అంపలాం కాలనీ వాసులు

సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

సంతబొమ్మాళి: మండలంలోని గోవిందపురం పంచాయతీలో సూపర్‌సిక్స్ పథకాలపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షకార్యదర్శులు జీరు భీమారావు,రెడ్డి అప్పన్న బెండి అరుణ్‌కుమార్, మెండ రామినాయుడు, సూరాడ ధనరాజ్,సువ్వారి ప్రసాద్ పాల్గొన్నారు.

● **టెక్కలి:** పోలవరం పంచాయతీ లచ్చన్నపేటలో టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు.కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, సర్పంచ్ బాలకృష్ణ, చంద్రరావు పాల్గొన్నారు.

● **నందిగాం:**గొల్లూరు, చిన్నారిగోకర్లపల్లి, సొంటినూరుల్లో గొల్లూరు సర్పంచ్ జీరు రాజేశ్వరి నానీరెడ్డి, ఎం.బాలకృష్ణ, పి.చంద్రశేఖర్, ఎం.లోకనాథం సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో తూలుగు మహేష్, మదన్‌గౌడ్, ఎన్.నాగరాజు, వి.లక్ష్మణరావు, కె.యాదవ్, పి.చిరంజీవి, టి.సింహాద్రినాయుడు, బి.బాలకృష్ణ, ఎన్.తిరుపతిరావు, కె.ధర్మారావు, జె.మోహనరావు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:**చినవంక, మెట్టూరు, నగరంపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.శశిభూషన్, దుర్యోధనరెడ్డి, అంబటి రామకృష్ణ పాల్గొన్నారు.

● **పలాస రూరల్:** నవరగోవిందపురం, మహాదేవపురం, సుబ్బుగుడ్డిల్లో టీడీపీ నాయకులు ఎన్నికలప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, దువ్వాడ సంతోష్, వంకల కూర్మారావు, హొరియా మోహనరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

●**పలాస:** పలాస-కాశీబుగ్గలోని 11వ వార్డు బ్రాహ్మణవీధి, డెంకివీధి, రాధాకాంతస్వామి ఆలయం వీధుల్లో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు మాట్లాడారు.కార్యక్రమంలో బి. ఉమాకాంత్, మన్మధరావు, చిరంజీవులు, జానకిరావు, రమేష్, సూర్యం, నాబిలి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థి శిరీషకు మద్దతుగా తాము నిలుస్తామని ఎంఆర్‌పీ నాయకులు ఎల్.ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు రాణా శ్రీనివాసరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు దాసరి తిరుమలరావు ప్రకటించారు. ఈ మేరకు గురువారం శిరీషను కలుసుకొని మద్దతు పలికారు. కార్యక్రమంలో హేమశేఖర్, రవి, మీల జోగారావు, బైరాగి, రాజారావు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి: ఏసీ



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కొండలరావు

జలుమూరు: ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న విలువ గుర్తించి ఓటు హక్కుపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని వెలుగు ఏరియా కోఆర్డినేటరు కె.కొండలరావు తెలిపారు. గురువారం మండలంలోని నారాయణవలస సంతలో ఓటుహక్కు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం తవిటినాయుడు, పలువురు సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

తాగు నీటిఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి

జలుమూరు: మండలంలోతాగు నీటిఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని పాగోడు, గుగ్గిలి, సర్పంచ్‌లు దామ మన్మథరావు, కరవంజ కూర్మారావు, శ్రీముఖలింగం ఎంపీటీసీలు కె.హరిప్రసాద్‌లతో పాటు పలువురు సభ్యులు కోరారు. గురువారం జలుమూరులో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన మండల సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ అచ్యుతాపురం ప్రాజెకు మోటారుకు మరమ్మతుచేసి తాగునీరందించాలని కోరారు. ఉపాధి వేతనదారులకు కొలతలు ప్రకారం పనులుచేయించి వేతనం చెల్లించాలని గుగ్గిలి సర్పంచ్ కూర్మారావు తెలిపారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు తంగి మురళీకృష్ణ, డోల నాగరత్నం, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో ఎ.దామోదరావు పాల్గొన్నారు.

అచ్చెన్నకు పరామర్శ



అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడును పరామర్శిస్తున్న భరత్

టెక్కలి:టీడీపీ రాష్ట్రఅధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి, ఎంపీ రామ్మోహన్‌నాయుడు నానమ్మ కళావతి ఇటీవల మృతిచెందడంతో గురువారం నిమ్మాడలో పలువురు టీడీపీ నాయకులు వార్ని పరామర్శించారు. ఈ సందర్భంగా విశాఖ మాజీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్, విశాఖ టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి ఎం.భరత్, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జి, కలమట వెంకటరమణ పరామర్శించి, కళావతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నియోజకవర్గం పరిధిలో పలు గ్రామాల నుంచి తరలివచ్చి రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుతోపాటు కింజరాపుసోదరులు ప్రభాకర్, హరిప్రసాద్‌లను కూడా పరామర్శించారు.

ఇంటర్ సిటీకి హాల్ట్ ఇవ్వాలి

సంతబొమ్మాళి: బరంపురం-విశాఖ మధ్య నడుస్తున్న ఇంటర్‌సిటీ రైలు కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌లో హాల్ట్ సదుపాయం కల్పించాలని టీడీపీ మండలాధ్యక్షుడు జీరు భీమారావు, మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, వారాధి చంట ఒక ప్రకటనలో కోరారు. గతంలో బరంపు రం-విశాఖ మధ్య పాసింజర్ రైలుగా ఉండేదని, అప్పట్లో రైలు కోటబొమ్మాళి స్టేషన్ ఆగేదని తెలిపారు. కరోనా అనంతరం ఈ రైలును ఇంటర్ సిటీగా మార్చిన తర్వాత కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌లో ఆపడం లేదని పేర్కొన్నారు. కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ నుంచి ప్రతి రోజూ సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పోలాకి మండలాల నుంచి వేలాదిమంది బరంపురం విశాఖకు ప్రయాణాలు సాగిస్తుంటున్నారని తెలిపారు. తక్షణమే ప్రయాణికులు సౌకర్యంకోసం బరంపురం ఇంటర్ సిటి కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ నిలుపదల చేసేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎయిర్‌హోల్‌లో పడి ఆవు మృతి

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట సమీపంలోని మెగా రక్షిత మంచినీటిపథకానికి సంబంధించిన ఎయిర్ హోల్‌లో గురువారం ఆవుపడి మృతి చెందింది. ఆవు యజమాని టి.ఉమామహేశ్వరరావు బయటికి తీశాడు. దీని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని తెలిపాడు. రక్షిత మంచినీటి పథకం నిర్వహించే కాంట్రాక్టర్,సంబంధితఅధికారులు పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా ఎయిర్‌హోల్‌ను కప్పించాలని కోరుతున్నారు.

మన్మథకుమార్‌మిశ్రోకు స్టార్ అవార్డు

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటకు చెందిన దివ్యాంగుల రాష్ట్ర ఉద్యోగసంఘం కార్యవర్గ సభ్యుడు, సక్షం జిల్లా కన్వీనర్ మన్మథకుమార్‌మిశ్రోకు ఇంటర్నేషనల్ స్టార్ అవార్డును ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన వర్తీవెల్‌నెస్ ఫౌండేషన్ ప్రకటించింది. సమాజంలో తాను ప్రజలకు అందించిన సేవలకు అవార్డు లభించిందని మన్మథకు మార్‌మిశ్రో గురువారం తెలిపారు. ఈ మేరకు ఎంఈవోలు సీహెచ్ మణికుమార్, కె.చంద్రమౌళి,ఉపాధ్యాయులు, సక్షం కార్యవర్గ సభ్యులు అభినందించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జలుమూరు: తిలారు-ఉర్లాం స్టేషన్ల మధ్యలో రైల్వే ట్రాక్‌పై గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు శ్రీకాకుళం జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. ఆమదాలవలస నుంచి తిలారు వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెంది ఉంటాడని చెప్పారు.ప్రమాదంజరిగి నాలుగైదు రోజులు కావడం తో మృతదేహం ఉబ్బి గుర్తుపట్టని విధంగా ఉందని తెలిపారు. మృతదేహానికి శవపంచనామా జరిపి శ్రీకాకుళంసర్వజన ఆసుపత్రి మార్చురీలో భద్రపరచినట్లు చెప్పారు.ఆచూకీతెలిసినవారు సంప్రదించాలని కోరారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

హరిపురం:మందస మండలంలోని మఖరజోల పరిధిలోని రంగోయిగేటు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుంటనర్సింగులు(40) చికిత్సపొందుతూ (40)గురువారం మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనడం తోగాయపడ్డాడు.దీంతో వైద్యంకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడనుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు. నర్సింగులుకు భార్య, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మందస పోలీసులుకేసు నమోదు చేశారు.

దౌర్జన్యానికి దిగుతున్నారని ఫిర్యాదు

పలాస: తాము కొనుగోలు చేసిన భూములు స్థానికంగా ఉన్న ఓ వర్గం ఆక్రమించి తమపైనే దౌర్జన్యానికి దిగుతోందని స్థానిక సూదికొండకాలనీకి చెందిన సైన చాణిక్య కాశీబుగ్గ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. తాము 2021లో పల్లివీధిలో ఓ మహిళ వద్ద సర్వేనెంబరు 36/4లో 36 అడుగుల స్థలాన్ని కొనుగోలు చేసి కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. హద్దులు కూడా పాతామని, సాయిబులకాలనీకి చెందిన షేక్‌దాది కుటుంబంతో పాటు మరికొంతమంది ఈ స్థలంపై షెడ్లు వేసి తమను బెదిరిస్తున్నారని చాణిక్య తెలిపాడు. శుక్రవారం వెళ్లి ప్రశ్నించగా రూ.రెండు లక్షలు ఇస్తేనే స్థలం ఇస్తామని, లేకుంటే ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు. వాస్తవాలు పరిశీలించి తమకు న్యాయం చేయాలని చాణిక్య పోలీసులను కోరాడు.

టీడీపీలో 130 కుటుంబాల చేరిక



మందస మండలం గొల్లలపాలెంలో కండువాలు వేసి ఆహ్వానిస్తున్న శిరీష

పలాస/హరిపురం:మందస మండలంలో వైసీపీ నుంచి 130 కుటుంబాలు టీడీపీలో చేరాయి. గొల్లలపాలెంలో 50 కుటుంబాలు,నల్లబొడ్లూరులో 60 కుటుంబాలు,కుడుమాసింగిలో 20 కుటుంబాలకు చెందిన వారికి గొల్లలపాలెంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష కండువాలు వేసి ఆహ్వానించారు. ఉపసర్పంచ్ తెప్పల పోలయ్య, ఎం.మధుబాబు, నర్తు రామారావు, ధనలక్ష్మి, రూపావతి, కృష్ణారావు, దివాకర్, మేఘనాధం, తెప్పల అప్పలస్వామితోపాటు 130మంది చేరారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి తాతారావు, అందాల రామారావు, మామిడి తాతారావు, కె. వెంకటరావు, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, బావన దుర్యోధన పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:**కొండపల్లికి చెందిన 20 కుటుంబాలు టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో యంపళ్ల తులసీదాస్, జోగి తిరుపతిరావు పాల్గొన్నారు.

చిట్టయ్యవలస పంచాయతీ నుంచి 20 కుటుంబాలు..

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలోని చిట్టయ్యవలస పంచాయతీ చవితి పేట, భగీరథపేటకు చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరాయి. కూన అప్పన్న, శ్రీనివాస్, రామినాయుడు, రమేష్, తవిటినాయుడు, నారాయణరావు, అప్పలనాయుడు, యవ్వారి మల్లేసు, కృష్ణారావు, సంపతిరావు ప్రకాష్ టీడీపీలో చేరారు.అనంతరం వారంతా టీడీపీ రాష్ట్రఅధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, టీడీపీ నందిగాం మండలాధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, హరివరప్రసాద్, నారాయణరావు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్‌కు జగన్‌ను ఓడించండి

● పాతపట్నం నియోజకవర్గ కూటమి అభ్యర్థి గోవిందరావు



చింతలబడవంజలో సూపర్‌సిక్స్ కరపత్రాన్ని అందజేస్తున్న గోవిందరావు

ఎల్.ఎన్.పేట: భావితరాలవారి భవిష్యత్తుకోసం మే నెలలో జరగనున్న ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని పాతపట్నం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చింతలబడంజ, బొర్రంపేటల్లో ఎన్డీఏ ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.అనంతరం జంబాడలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, వి.సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.భద్రయ్య, గోవిందరావు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

నరసన్నపేట: ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజవర్గం, రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని నరసన్నపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంత్రి నర్సింహమూర్తి ఆరోపించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పేదల,బడుగు,బలహీన వర్గాలకు కాంగ్రెస్‌అండగా ఉంటుందన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కేంద్రలో ఇండియా కూటమి అధికారంలో రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

'పట్టు పరిశ్రమ భూముల ఆక్రమణ వాస్తవమే'

హరిపురం: మందస మండలంలోని రాధాకృష్ణాపురంలోని పట్టుపరిశ్రమ (సీడ్ ఫారం) భూములు ఆక్రమణ వాస్తవమేనని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి టి.రాజేంద్రప్రసాద్‌బాబు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారు. పరిశ్రమకు సంబంధించిన భూములు ఆక్రమణ గురైనట్లు నిర్ధారించగా.. హద్దురాళ్లు తొలగించి కంకర తవ్వకాలు జరిగినట్లు గుర్తించారు. దీంతో స్థానిక తహసీల్దార్‌కు పరిశ్రమ భూములకు హద్దులు గుర్తిం చాలని, సర్వేచేసి పరిశ్రమ భూములు తిరిగి దఖలు పర్చాలని తెలియజేశామని, అనంతరం ఎంతమేర ఆక్రమణలు జరిగాయో నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు.

అరాచక పాలనకు అంతం పలకండి

●నరసన్నపేట కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి పిలుపు



మెట్టపేటలో కండువావేసి ఆహ్వానిస్తున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు (సారవకోట): అరాచక పాలనకు అంతం పలకాలని నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన,బీజేపీ కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం సారవకోట మండలంలోని చిన్నగుజ్జువాడ పంచాయతీలో గల గుజ్జివాడ, పురుషోత్తకర్ర గ్రామాల్లో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, జనసేన నాయకులు బలగ ప్రవీణ్, టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, పట్ట ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

● **నరసన్నపేట/పోలాకి:** పోలాకి మండలంలోని మెట్టపేటకు చెందిన వైసీపీ నాయ కులు సంపతిరావు శ్రీరామమూర్తి, తమ్మినేని గురుమూర్తి పెంట రాజగోపాల్‌తోపాటు 30 కుటుంబాలు ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో టీడీపీ చేరాయి. కార్యక్రమంలో ఎంపీ అప్పలనాయుడు, చిట్టి సింహాచలం పాల్గొన్నారు.

రేపు టీడీపీ శంఖారావ యాత్ర

టెక్కలి: టీడీపీ ఎన్నికల శంఖారావ యాత్రను ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు టెక్కలిలో శనివారం ప్రారంభించనున్నారని పార్టీ మండలాధ్యక్షుడు బగాది శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు కిల్లిపోలమ్మ ఆలయం వద్ద ఎన్నికల శంఖారావం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

'సి-విజిల్'లో ఫిర్యాదు చేయండి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి: వలంటీర్లు, అధికార పార్టీ నాయకులు తప్పిదాలకు పాల్పడితే సి-విజిల్ యాప్ లో ఫిర్యాదుచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. గురువారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయం నుంచి టీడీపీ శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీ కూడా జగన్‌రెడ్డి రాజకీయం చేస్తూ వృద్ధులకు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇవన్నీ తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. టీడీపీతోనే సంక్షేమ పథకాలు సాధ్యమని, నెలకు రూ.4వేలు పింఛన్, మూడు నెలలకు ఒకసారైనా తీసుకునే అవకాశం కల్పించనున్నట్లు ఇంటింటికి తెలియాలన్నారు. శనివారంసాయంత్రం 3.30గంటలకు టెక్కలి కిల్లిపోలమ్మ ఆలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ఎన్నికల శంఖారావ సభను ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రారంభించనున్నారని తెలిపారు. కార్య క్రమంలో నాయకులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, బోయిన రమేష్, జీరు భీమారావు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచాలి

● టెక్కలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నూరుల్‌కమర్



నందిగాం: గొల్లూరు పోలింగ్ కేంద్రంలో మాట్లాడుతున్న నూరుల్‌కమర్

టెక్కలి: ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచాలని బీఎల్వోలకు సబ్‌కలెక్టర్, టెక్కలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నూరుల్‌కమర్ సూచించారు. గురువారం నర్సింగపల్లి, మొఖలింగాపురం, గూడేంల్లో పోలింగ్‌కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. బీఎల్వోలు, రమేష్, భారతి, సింహాచలం నుంచి గతఎన్నికల్లో ఎంతశాతం పోలింగ్, ఈ ప్రాంతం నుంచి ఓటర్ల వలసలను ఆరాతీశారు.గతఎన్నికల కంటే ఓటింగ్ శాతం పెరిగేలా చూడాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందన్నారు. ప్రతి పోలింగ్‌కేంద్రానికి మరు గుదొడ్లు, తాగునీటి, విద్యుత్ సౌకర్యం, స్విచ్‌బోర్డులు, ఫ్యాన్, ర్యాంపులు వంటివి ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరితో పాటు ఏఈఆర్‌వో మురళీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

●**నందిగాం:** మండలంలోని పెద్దతామరాపల్లి, కోమటూరు, పోతులూరు, చిన్నతామరాపల్లి, కర్లపూడి, నౌగాం,రధజనబొడ్డపాడు, గొల్లూరు, బెల్లుకోల, చిన్నారిగోకర్లపల్లి, రాంపురం తదితర పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్‌కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నూరుల్‌కమర్ పరిశీలించారు. ఆయాకేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలపై పరిశీలించి, ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఓటర్లకు అన్నిరకాల వసతులు అందుబాటులో ఉంచాలని స్థానిక అధికారులకు, బీఎల్వోలకు సూచించారు. కార్య క్రమంలో ఎంసీసీ అధికారి జి.శివప్రసాద్, తహసీల్దార్ వి.పద్మావతి, డీఎల్‌పీవో ఐవీ రమణ, మండల సర్వేయర్ కె.జోగారావు, ఆర్ఐ కిరణ్, సెక్టార్ అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

వాసుదేవు వర్ధంతి సభ విజయవంతం చేయాలి

వజ్రపుకొత్తూరు: కామ్రేడ్ పైల వాసుదేవు 14 వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని రిట్టపాడులో వాసుదేవు స్థూపం వద్ద కరపత్రం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 11న రిట్టపాడు, 14న పలాస మండలం మామిడిపల్లిలో సభలు జరుగుతాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన హరి

సరుబుజ్జిలి: ఆలికాం- బత్తిలి ప్రధాన రహదారి రొట్టవలస సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోట హరి (25) అనే యువకుడు మృతి చెందినట్టు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హిరమండలం మండలం రెల్లివలస గ్రామానికి చెందిన హరితో పాటు మరో యువకుడు బైక్‌పై ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రొట్టవలస సమీపానికి చేరుకునే సరికి పొలాల్లో నుంచి ట్రాక్టర్ ఒక్కసారి రోడ్డుపైకి అడ్డగా రావడం తో బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో హరి ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, బైక్ వెనుక కూర్చున్న మరోవ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో శ్రీకాకు ళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. హరి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నిహార్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

శ్రీకాకుళం క్రైం: పెద్దపాడు వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ జి.వాసుదేవరావు తెలిపిన వివరాల మేరకు.. నరసన్నపేట నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం పెద్దపాడు మారుతీ షోరూం దగ్గర రోడ్డు దాటుతున్న శ్రీకాకుళం నగరం కామరాజమ్మ కాలనీకి చెందిన మళ్లారెడ్డి కోటేశ్వరరావు (56) అనే వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. స్థానికుల సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ వాసుదేవరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి


అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

సరుబుజ్జిలి: భారత రాజ్యాంగ హక్కులతో ప్రతి పౌరుడికి కల్పించిన ప్రధాన హక్కు ఓటు అని, దానిని వినియోగించుకోవాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం మండల కేం ద్రమైన సరుబుజ్జిలి గ్రామంలో తహసీల్దార్ రమేష్‌బాబుతో పాటు బూర్జ తహసీల్దార్ అంబేద్కర్, ఐకేపీ ఏపీఎం కమలకుమారి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌వో సుజాత, ఐకేపీ సీసీలు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర ప్రగతి


మాట్లాడుతున్న పైడి నాగభూషణరావు

శ్రీకాకుళం అర్బన్: రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే దేశం, రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తాయని శ్రీకాకుళం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పైడి నాగభూషణ రావు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదాతో పాటు ఉచిత విద్య అందిస్తామని, ప్రతి పేదవాడికి ఏడాదికి లక్ష రూపాయలు సాయం అందిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవింద మల్లిబాబు, జీపీ నాయుడు, రమేష్ కుమార్, సీహెచ్ గోవిందరావు, వామపక్ష నాయకులు టి.తిరుపతిరావు, హనుమంతు విశ్వేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సంఘ సభ్యులు

ఇచ్ఛాపురం: ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకొనేలా గ్రామాల్లో అవగహనా కల్పించాలని ఏఈపీఎం సనపల ప్రసాద్ అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో స్వీప్ యాక్టీవిటీస్, ప్రాజెక్ట్ ప్రాధాన్యత కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం సన్యాసిపుట్టుగ, కేసుపురం, ధర్మపురం గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ లక్ష్మి, వీవోఏఎస్ ఈశ్వరి, సావిత్రి, జ్యోతి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు.. మేనిఫెస్టోలో పెట్టాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

ఇచ్ఛాపురం: లక్షలాది మంది ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సీపీఎస్ విధానం రద్దు అంశాన్ని ఈ ఎన్నికలో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌పీ అనంతాచార్యులు కోరారు. గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారంపై అన్ని రాజకీయ పార్టీలు సానుకూలంగా స్పందించాలని కోరారు. 1500 మంది విద్యార్థుల గల ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బది కొరత ఎక్కువగా ఉంది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం అయ్యేనాటికి పోస్టుల కొరతను తీర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం

అనంతరం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పిట్ట శంకర్, జి.ఉమాశంకర్, గౌరవ అధ్యక్షులుగా ఎస్.విశ్వనాథం, సహాధ్యక్షులుగా ఎం.సూర్యారావు, అదనపు కార్యదర్శిగా కె.సత్యమయ్య, ఉపాధ్యక్షులుగా కె.రవీంద్రబాబు, ఇతర కార్యకవర్గం ఎన్నికయ్యారు.

'నాడు-నేడు' కేటాయింపుల్లో వివక్ష

- ఐదుగురున్న పాఠశాలకు నిధులు
- 12 మంది ఉన్న చోట నిర్లక్ష్యం
- శిథిలావస్థలో బురిడివలస పాఠశాల భవనం


అన్ని హంగులతో ఐదుగురు విద్యార్థులున్న షలంత్రి పాఠశాల

సరుబుజ్జిలి: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు నాడు-నేడు నిధులు ద్వారా నిర్వహించిన అభివృద్ధి పనుల్లో స్థానిక నాయకులు చూపిన వ్యత్యాసాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని షలంత్రి గ్రామ పంచాయతీలో ఉన్న షలంత్రి ప్రాథమిక పాఠశాలకు సుమారు రూ.14 లక్షలు నిధులు మంజూరు చేసిన అధికారులు అదే గ్రామ పంచాయతీలో శిథిలావస్థలో ఉన్న బురిడివలస కాలనీ ప్రాథమిక పాఠశాలకు నాడు-నేడు నిధులు మంజూరు చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం ఐదుగురు విద్యార్థులు ఉన్న షలంత్రి పాఠశాలకు అధికార పార్టీ నాయకులు నిధులు మంజూరు చేయించి, 12 మంది విద్యార్థులతో బలహీనవర్గాల కాలనీలో ఉన్న బురిడివలస పాఠశాలను పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ పాఠశాల పూర్తి శిథిలావస్థకు చేరుకొని మరుగుదొడ్లు కూడా దయనీయ స్థితిలో ఉండగా పాఠశాల ఏ క్షణాన కూలిపోతుందోనన్న భయంతో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు పరాయి పంచన పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇటువంటి పాఠశాలకు నాడు-నేడు నిధులు కాదు కదా.. కనీస మరమ్మతులు చేపట్టిన అధికారులు కేవలం ఐదుగురు విద్యార్థులు ఉన్న షలంత్రి ప్రాథమిక పాఠశాలకు విశాలమైన మూడు భవనాలతో పాటు ఖరీదైన బెంచీలు, గాలిపంకాలు, ఎల్ఈడీలు, తాగునీటి వసతి, నూతన మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంపై బురిడివలస కాలనీకి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖాధికారులు, అధికార పార్టీ నాయకులు నాడు-నేడు నిధుల మంజూరులో చూపిన వ్యత్యాసంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థలో ఉన్న బురిడివలస కాలనీ పాఠశాల

పెందుర్తి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురి మృతి.. ఏడుగురికి తీవ్రగాయాలు
- రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్
- పెళ్లి వేడుక నుంచి వస్తుండగా విషాదం
- మృతుల్లో తండ్రి, కొడుకు

పెందుర్తి, ఏప్రిల్ 4: విశాఖపట్నం జిల్లా పెందుర్తి సమీపంలో గల అక్కిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారి (నంబర్ 16)పై గురువారం తెల్లవారు జామున ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ నేతృత్వంలో సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్ నుంచి క్షతగాత్రులను అత్యంత లాఘవంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకకుం జిల్లా పొందూరు మండలం గోగన్నపేట పంచాయతీ రంగనాథపేటకు చెందిన కొందరు దశాబ్దం క్రితం తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. రంగనాథపేటలో బంధువుల వివాహ వేడుక ఉండడంతో హనుమంతు ఆనందరావు, హనుమంతు చంద్రశేఖర్, చింతాడ ఇందు, అమ్మయ్యమ్మ, బొడ్డేపల్లి జ్యోతి, మెట్ట లక్ష్మి, వెంకటలక్ష్మి, నాగమణి, నీలవేణిలు బుధవారం ఉదయం మినీ వ్యాన్‌లో వెళ్లారు. బుధవారం రాత్రి వివాహ వేడుక ముగిసిన తరువాత శ్రీకాకుళం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. వ్యాన్‌ను వినయ్ డ్రైవ్ చేస్తున్నాడు. పెందుర్తి బైపాస్ రోడ్డులో సరిపల్లి సమీపంలో అక్కిరెడ్డిపాలెం వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపు తప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో వ్యాన్ ముందుభాగం పూర్తిగా నుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న హనుమంతు ఆనందరావు (45), హనుమంతు చంద్రశేఖర్ (17) చింతాడ ఇందు (58) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మిగతా వారికి తీవ్రగాయాలయ్యాయి. కాగా మృతుల్లో హనుమంతు ఆనందరావు (45), చంద్రశేఖర్ (17) తండ్రీకొడుకులు. వీరంతా దశాబ్దం కిందట పనుల కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వలస వెళ్లారని పోలీసులు చెబుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే ఉందని సీఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడమే కారణమని పోలీసులు చెబుతున్నారు.


వ్యాన్‌లో తండ్రీ కొడుకు మృతదేహాలు


ప్రమాదానికి గురైన మినీ వ్యాన్


ప్రమాదంలో గాయపడినవారు

మహిళలే టీడీపీ రథసారథులు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


బూర్జ: సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

సరుబుజ్జిలి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆవిరావం నుంచి ప్రతి ఎన్నికల విజయంలోనూ మహిళలు టీడీపీ రథసారథులుగా నిలుస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. గురువారం సరుబుజ్జిలి మండలం అమృతలింగానగరం వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు అధ్యక్షతన జయహో బీసీ మహిళా సమావేశాన్ని నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ.. అబద్ధాలు, అపనమ్మకాలు, అరాచకాలు, శవ రాజకీయాల పునాదులపై సైకో సీఎం జగన్‌రెడ్డి వైసీపీ నడుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, టీడీపీ నాయకులు శివ్వాల సూర్యనారాయణ, కిల్లి సిద్దార్థ, పల్లి సురేష్, నందివాడ గోవిందరావు, పేడాడ మణికుమారి, బీజేపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షుడు వేల్పుల గోవిందరావు, పైడి మురళీమోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారిస్తా..

బూర్జ: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి మహిళలు సహకరించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ కోరారు. కొల్లివలసలోని పార్టీ కార్యాలయం ఆవరణలో టీడీపీ మహిళా శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షుడు కాంతమ్మ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణనాయుడు, మొదలవలస రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు రాంజీ, బీజేపీ నాయకులు సూరపునాయుడు, జనసేన పార్టీ నాయకులు విక్రమ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రహిత రాష్ట్రమే కూటమి లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

శ్రీకాకుళం అర్బన్: వైసీపీ పాలనల నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తి కోరుకుంటున్నారని, ఆ దిశగా ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పాటైందని ఆ పార్టీల నాయకులు అన్నారు. స్థానిక టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు గురువారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోనాలను దృష్టిలో ఉంచుకుని ఈ మూడు పార్టీలు కూటమిగా ఏర్పాడ్డాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధులు, జరగాల్సిన అభివృద్ధి కోసమే జతకట్టాయని తెలిపారు. జగన్‌రెడ్డి అరచాక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు ఈ కూటమి ప్రజలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి సంపద సృష్టించి ప్రతీ ఆంధ్రుడికి అండగా నిలుస్తుందని భరోసా నిచ్చారు. రాష్ట్రంలో దళితలకు స్వేచ్ఛలేకుండా పోయిందన్నారు. సమావేశంలో కూటమి నాయకులు చిట్టిమోహన్, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పిసిని చంద్రమోహన్, కోరాడ సర్వేశ్వరరావు, భాస్కరరావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

శ్రీకాకుళం అర్బన్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కళావతమ్మ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా గురువారం రిమ్స్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ కళావతమ్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, లెక్చరర్ కె.పద్మావతి మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ స్వాతంత్ర్య సమరయోధుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీవో పి.సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఎం.మిచెల్, డి.ఉషా పన్నిగవేణి, నర్సింగ్ విద్యార్థినలు తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అరాచక పాలనను అడ్డుకునేందుకే..


ప్రచారంలో పాల్గొన్న గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: రాష్ట్రంలో వైసీపీ మూకల దాడులను, అరాచక పాలనను అడ్డుకునేందుకు కూటమి విజయం అనివార్యమని శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. ప్రచారంలో భాగంగా గురువారం నగరంలోని 28వ డివిజన్ దమ్మలవీధి, రూరల్ మండలం పొన్నాం, నవనంబాడు, బమ్మిడివానిపేట, గొల్లపేటల్లో ప్రజాగళం పేరుతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో అవినీతి, అరాచకాలు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలో జగన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తే అన్ని వర్గాలకు అండగా నిలుస్తారన్నారు.

ప్రచారంలో గొండు శంకర్ సతీమణి

గార: శ్రీకాకుళం నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతి గురువారం ఉదయం అంపోలు పంచాయతీ చల్లపేట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో తన భర్త శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు.

అనుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం


మాట్లాడుతున్న గుండ దంపతులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తల మనోభావాలు తెలుసుకోవడానికి పార్టీ అధిష్ఠానం మరోసారి రహస్యంగా సర్వే చేస్తుండడం ఆనందంగా ఉందని, చంద్రబాబు తుదినిర్ణయం తమకు అనుకూలంగా వస్తుందని భావిస్తున్నట్టు మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. గురువారం అరసవిల్లిలోని వారి నివాసంలో గార మండల టీడీపీ ముఖ్య నాయకులతో గుండ దంపతులు సమావేశమయ్యారు. మరికొంత సమయం అవసరంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గార మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం


కలశాలకు పూజలు చేస్తున్న చినజీయర్ స్వామి

ఎచ్చెర్ల: ఫరీద్‌పేట గ్రామంలో రంగనాథస్వామి ఆలయంలో మూలవిరాట్, విగ్రహాల పునః ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం గురువారం కన్నుల పండువగా జరిగింది. ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం గత ఐదు రోజుల నుంచి జరుగుతుండగా, చివరి రోజైన గురువారం గ్రామంతోపాటు పరిసర గ్రామ ప్రజలు, శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ అభిషేకాలు, హోమాలు. పూజలు నిర్వహించారు. ముందుగా చినజీయర్‌స్వామి వారికి గ్రామ మహిళలు హారతినిచ్చి స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. వేలాది మంది భక్తులు పాల్గొనగా, కమిటీ సభ్యులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పూడి రాములు, పైడి రంగనాథం, సూర శ్యామలరావు, పైడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుండమ్మతల్లి ఉత్సవం


అమ్మవారిని పూజిస్తున్న మహిళలు

కవిటి: మండల కేంద్రంలోని ప్రగడపుట్టుగ జంక్షన్‌లో గల గుండమ్మతల్లి మండపం, సింహద్వార ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు పసుపు, కుమ్మ, చీరలు అమ్మవారికి సమర్పించుకున్నారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే బి.అశోక్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

లోకేష్‌కు గుర్తింపు

ఆమదాలవలస: మండలం దూసిపేట పంచాయతీ నెల్లిమెట్ట గ్రామానికి చెందిన కంచరాపు లోకేష్‌కు టీడీపీ ప్రత్యేకంగా గుర్తింపునిచ్చింది. టీడీపీ రూపొందించిన యాప్ ద్వారా లోకేష్ వివిధ మాధ్యమాల్లో లెవెల్ సిక్స్ నమోదులో లక్ష పాయింట్లు సాధించాడు. ఇందుకు గుర్తింపునిస్తూ పార్టీ ఎన్నికల గుర్తు సైకిల్ స్నేహాన్ని బహూకరించగా, దానిని గురువారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ద్వారా లోకేష్ అందుకున్నారు.

వలంటీర్ల వ్యవస్థకు వ్యతిరేకం కాదు

శ్రీకాకుళం అర్బన్: వలంటీర్ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదని, ప్రస్తుత తరుణంలో వారిని రెచ్చగొట్టి వైసీపీ రాజకీయ లబ్ధిపొందాలని చూస్తోందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వలంటీర్లు మేలు చేస్తారని ఎన్డీయే కూటమి భావించి ఎన్నికల విధులకు వారిని దూరంగా ఉంచిందే తప్ప, వారిపై ఎటువంటి వ్యతిరేకత లేదన్నారు. పింఛన్ల పంపిణీ ప్రభుత్వ ఉద్యోగులే చేయాలని, వలంటీర్లను వాడటం సరికాదని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, దానిని టీడీపీపై నెట్టేయాలని వైసీపీ కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ నాయకులు గోర అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఉగాది పురస్కారానికి ఎంపిక


ధనవతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన సంగీత కళాకారిణి పెదిని ధనవతి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 7న హైదారాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ రెడ్డి గర్జన వేదికగా ఉగాది పురస్కారాన్ని అందించనున్నట్టు సభ ఆర్గనైజర్ గుర్రం పాపిరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ధనవతికి పురస్కారం రావడంపై ఆల్ ఇండియా కళారంగం వ్యవస్థాపకులు అధ్యక్షులు ముడుగుల సుధీర్, స్థానిక కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

రూ.1.60 లక్షల స్వాధీనం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్ద మురహరిపురం జంక్షన్‌లో వాహనాల తనిఖీలో భాగంగా గురువారం రూ.1.60 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తనిఖీఅధికారి డి.మంగరాణి తెలిపారు. జోగాపాపారావుకు చెందిన ద్విచక్రవాహనం తనిఖీ చేయగా, ఈ మొత్తం పట్టు బడినట్టు చెప్పారు.

కార్యకర్తలతో సమావేశం

ఇచ్ఛాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కార్యకర్తలకు కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

నిర్భయంగా ఓటు వేయండి

శ్రీకాకుళం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు అన్నారు. గురువారం రాత్రి పెద్దపాడు గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్థులతో మాట్లాడుతూ.. గ్రామంలో ఏటువంటి ఘర్షణలు, కొట్లాలకు పాల్పడకుండా ఓటు వేయాలని కోరారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో జరిగిన ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులతో పాటు గ్రామస్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో సీఐతో పాటు ఎస్ఐ వాసు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

శ్రీకాకుళం క్రైం: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణం నిర్వహించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు టూ టౌన్ సీఐ జి.ఉమామహేశ్వరావు అన్నారు. ఈ మేరకు గురువారం గొంటివీధి, కత్తెర వీధిది న్యూ కాలనీ, నాన్‌బాలవీధుల్లో పోలింగ్ కేంద్రాలను, ఇన్, ఔట్ దారులను పరిశీలిస్తూ, కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనవసరపు ఘర్షణలకు పాల్పడకుండా శాంతిభద్రతకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. ఎన్నికల నియామావళి పై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఫ్లాగ్ మార్చ్ చేపట్టినట్టు సీఐ తెలిపారు. ఎస్ఐ హరికృష్ణ, కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.


ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు